జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



వైపాలెంలో పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి (కురిచేడు): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఎం.దేవప్రసాద్, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ నిమ్మకాయల రాజయ్య, మైనార్టీ సెల్ కన్వీనర్ అమీన్‌బాషా, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ ఏఎంసీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ సర్పంచ్ జి.వెంగళరెడ్డి, మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి, కొడవటి జాను, సొసైటీ మాజీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, కె.జోసఫ్, నాయకులు, కార్యకర్తలు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాసు, అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, డాక్టర్ నగేష్, డాక్టర్ జి.హనుమంతురావు, డాక్టర్ జి.వేణు, డాక్టర్ ఆర్‌సీ రెడ్డి, సి.రమేష్, వైవీ రమణ, బి.సారీలమ్మ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు బీసీ సంఘాలు, బీజేపీ నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కందూరి కాశీవిశ్వనాథ్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పి.రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, కె.సత్యనారాయణ చౌదరి, దోగిపర్తి సంతోష్ కుమార్, సూరె శ్రీనివాసులు, మొగిలి సుబ్బారావు, హరినాయక్, షేక్ కాశిం, కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



దర్శి: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

కురిచేడు: మహాత్మా జ్యోతిరావుపూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైవీ సుబ్బయ్య అన్నారు. స్థానిక జెడ్పీటీసీ నుసుం వెంకటరెడ్డి కార్యాలయం ఆవరణలో శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ సమసమాజస్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వరికూటి వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ గుంటక నాసరరెడ్డి, నాయకులు కోలా సంతోష్‌కుమార్, అంకె వెంకటేశ్వర్లు, అంకె కృష్ణ, నుసుం వెంకటరెడ్డి (బుజ్జి), వెలుతుర్ల కొండలురెడ్డి, అంకె శ్రీను పాల్గొన్నారు.

తాళ్లూరు: జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని సమాజానికి సేవలు చేయాలని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎంఈఓ–1 సుబ్బయ్య, ఎంఈఓ–2 సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. బి.కళ్యాణ్‌రావువు, బి.వేణు, జె.నాగరాజు, నరసయ్య, చిరంజీవి, ఖాశిం సాహెబ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కూలిన మిద్దె

యర్రగొండపాలెం: ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతంలో మిద్దె కూలి అందరినీ భయభ్రాంతులు చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానిక వినుకొండ రోడ్డులో పేరం నాగిరెడ్డికి చెందిన పాత మిద్దె స్లాబ్ కూలి ఆ దిమ్మెలు రోడ్డుపై పడ్డాయి. ఎప్పుడూ రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మిద్దె కూలే సమయంలో ప్రజలు లేకపోవడం, రాకపోకల రద్దీ తగ్గడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అక్కడే ఉన్న మోటారు బైక్ మాత్రం పూర్తిగా దెబ్బతింది.

అడుగంటిన భూగర్భ జలాలు

యర్రగొండపాలెం: పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం నియోజకవర్గంలో కరువు చాలా తీవ్రంగా ఉందని రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీరయపాలెం, సాయిబాబా నగర్ ప్రాంతాల్లోని పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి వర్గం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతం రైతులు నిమ్మ, బొప్పాయి, బత్తాయి, అరటి, దానిమ్మ లాంటి ఉద్యాన పంటలను విస్తృతంగా పండించేవారని, కొంతమంది రైతులు కరువు పరిస్థితులను అధిక మించేందుకు బోరు బావులు తొవించారని, అయినా వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలు సుదూర ప్రాంతాలకు తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చుల్లో సగభాగం ప్రభుత్వం భరాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, బాణాల రామయ్య, మన్నె సాంబశివరావు, నక్కా తిరుపతయ్య, అంగిరేకుల చంద్రశేఖర్, అంగిరేకుల వెంకటరావు, ముప్వ చక్రవర్తి, సుబ్బారావు ఉన్నారు.

కల్తీ పాలపై నిఘా



ఓ డెయిరీ వద్దకు మారువేషంలో వచ్చిన పోలీసులు

దర్శి (కురిచేడు): దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలో పాల కల్తీపై నిఘా పెంచినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు గ్రామాలు దత్తత ఇచ్చినట్లు సీఐ రామారావు తెలిపారు. గ్రామాల్లో పాలు పితికే సమయాల్లో పోలీసు సిబ్బంది లుంగీలు, పంచెలు ధరించి గ్రామాలకు వెళ్లి నిఘా పెట్టి ఆకస్మికంగా తనిఖీలు చేస్తారన్నారు. అత్యాశకు వెళ్లి పాలల్లో హానికర పదార్థాలు కల్తీ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేతలకు బూచేపల్లి పరామర్శ



శివారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి (కురిచేడు): మండలంలోని ఎర్రఓబనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శివారెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న శివారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని బూచేపల్లి ఆకాంక్షించారు. సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

పెద్దదోర్నాల: మండలంలో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 36 బృందాలుగా ఏర్పడిన అధికారులు 19 గ్రామాల్లో 3150 సర్వీసులు తనిఖీ చేశారు. అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న, అధిక లోడు వినియోగిస్తున్న వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. మొత్తం 65 కేసులకు రూ.1.48 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈఈలు నాగేశ్వరరావు, హైమావతిల ఆధ్వర్యంలో మార్కాపురం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సియానాయక్, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం మండలాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగులమీరాస్వామి ఉరుసు



ముస్తాబైన శ్రీనాగులమీరాస్వామి దర్గా

పెద్దారవీడు: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకంగా పెద్దారవీడులో శ్రీ నాగులమీరాస్వామి ఉరుసు మహోత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలంగా సంతానం కలగని వారు, దయ్యాలు, భూతాలకు భయడేవారు, ఎంతకి నయంకాని వ్యాధిగ్రస్తులు సైతం దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకుని విన్నవించుకుంటే తమ కోర్కెలు నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం. తమ కోర్కెలు తీరిన మరుసటి ఏడాది స్వామిని దర్శించుకుని వెండి గొడుగులు, నగదు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు. శనివారం గంధపూజ, ఆదివారం జెండాలు, సోమవారం కనుమ పండగ నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో పాటకచ్చేరీతో పాటు జబర్దస్త్ ఆర్టిస్ట్‌లతో సందడి చేయనున్నారు.

ఆలయ అధ్యక్షుడు గంగరాజుకు సన్మానం



గంగరాజును సన్మానిస్తున్న యాదవులు

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు కాశినాయన ఆశ్రమం గుండం చర్ల సమీపంలో వెలసిన గంగాభవానీ, శ్రీ వేనూతల కాటమరాజుస్వామి ఆలయానికి చైర్మన్‌గా ఎన్నికైన గుమ్మా గంగరాజును యాదవులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న యాదవ పెద్దలను కలిసి వారి సహకారం తీసుకొని ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం పీఎల్‌పీ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.

గుంటి గంగ తిరునాళ్లను విజయవంతం చేయాలి

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగమ్మ తిరునాళ్లకు ఈ నెల 14న వచ్చే భక్తులకు భద్రత కల్పించనున్నట్లు సీఐ వై.రామారావు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ పార్టీల నాయకులతో శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన సమావేశమయ్యారు. అనంతరం దేవస్థానం పరిసరాలు పరిశీలించారు. ఎస్సైలు ఎస్.రామారావు, కె.కమలాకర్, మురళితో పాటు ఆలయ ఈవో జి.వాసు, ఆలయ చైర్మన్ గురుబ్రహ్మం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు: మండలంలోని కురిచేడు, ఆవులమంద విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రికార్డుల్లేని వాహనాలకు జరిమానా

దర్శి (కురిచేడు): మోటారు వాహనాల తనిఖీ అధికారి రవికుమార్ శుక్రవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా రికార్డులు సక్రమంగా లేని, అధిక లోడుతో వెళ్తున్న 25 ఆటోలకు రూ.30 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో పొదిలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, దర్శి కంట్రోలర్ రామయ్య, షేక్ ఖాదర్‌వలి, జి.బ్రహ్మయ్య ఉన్నారు.

రంగనాయకుని దర్శనం.. పరమ పవిత్రం

- నల్లమలలో సుందర నిలయం నెమలిగుండ్ల ఆలయం
- 12,13,14 తేదీల్లో రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు



నెమలిగుండ్ల క్షేత్రం



నెమలిగుండ్ల రంగనాయక స్వామి



ఆదిలక్ష్మిఅమ్మవారు

రాచర్ల: రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామానికి 7 కిలోమీటర్ల దూరంలో గల దట్టమైన నల్లమల ఆడవుల్లో వెలసిన నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. రంగరంగ వైభవంగా నిర్వహించే స్వామివారి కల్యాణం, తెప్పోత్సవానికి తరలివచ్చే వేలాది మంది భక్తులతో నల్లమల అటవీ ప్రాంతం జనసంద్రంగా మారుతుంది.



తెప్పోత్సవం (ఫైల్)

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

నమ్మకానికి నిలయమైన నెమలిగుండ్ల క్షేత్రంలో 1994 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం అంకుర్పాణ, ధ్వజారోహణం, శేషవాహనం, హనుమంత వాహనం, 13న ఉదయం 11 గంటలకు రంగనాయకస్వామి కల్యాణం, 14న ఉదయం 9 గంటలకు స్వామివారి తెప్పోత్సవం, దివ్యరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ మల్లవరపు నాగయ్య తెలిపారు.

ఆలయానికి చేరుకునేదిలా..

నెమలిగుండ్ల క్షేత్రానికి గిద్దలూరు నుంచి కొండపేట, అంబవరం, వెల్లుపల్లి మీదుగా భక్తులు చేరుకోవచ్చు. అదే విధంగా గిద్దలూరు నుంచి రాచర్ల, అనుములపల్లె, జేపీచెరువు మీదుగా వెళ్లవచ్చు. అలాగే కంభం నుంచి తురిమెళ్ల, అక్కపల్లె, చోళ్లవీడు, చినగానిపల్లె, జేపీ చెరువు గ్రామాల మీదుగా రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

సత్రాల్లో అన్నసంతర్పణ

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మూడు రోజులపాటు ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయల కాపు, బలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశీనాయన రెడ్ల, యోగివేయన రెడ్ల, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, విశ్వబ్రహ్మణ, మేదర సత్రాల్లో అన్నసంతర్పణ చేస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాం. దేవస్థానం ప్రాంగణంలో భక్తుల కోసం అదనంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. దేవస్థానానికి వెళ్లే మార్గంలో అడుగడుగునా దాతల సహకారంతో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తాం.

– మల్లవరపు నాగయ్య, ఈఓ, రంగస్వామి దేవస్థానం



దేవస్థానం వద్ద గుండ్లకమ్మ జలపాతం